క్లుప్తంగా

బోనాలకు ఏర్పాట్లు చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మహేశ్వరం (పహాడీషరీఫ్): ఈ నెల 21వ తేదీన జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో జరుగనున్న బోనాల ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని ఆలయాల వద్ద ఏర్పాట్లు చేయాలని బీజేపీ నాయకులు సంతోష్, సుమిత్, శివలు మంగళవారం మున్సిపాలిటీ కమిషనర్ వాణిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాలనీలోని పోచమ్మ, దుర్గామాత ఆలయ పరిసరాలలో పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా కాలనీలో ఎక్కడ చూసినా రోడ్లపై మురుగు పారుతుండడం, చెత్త కుప్పలు పడి ఉండడం, రాత్రిపూట విద్యుద్దీపాలు వెలగకపోవడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతామని కమిషనర్ వారితో పేర్కొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



కట్టమైసమ్మ ఆలయం వద్ద దేప భాస్కర్‌రెడ్డి తదితరులు

హుడాకాంప్లెక్స్: ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సరూర్‌నగర్ కట్ట మైసమ్మ దేవాలయాన్ని ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహేందర్‌యాదవ్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు శంకర్ యాదవ్, నాయకులు ధన్‌రాజ్‌గౌడ్, బాలకిషన్, ఇమ్రాన్‌అలీ, కల్యాణ్‌యాదవ్, నబీ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాయకత్వ పటిమ ముఖ్యం



విద్యార్థులతో ఎన్‌సీసీ అధికారి లక్ష్మీబాయి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ కేంద్రంలోని రవీంద్ర భారతి స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు నాయకత్వ లక్షణాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎన్‌సీసీ అసోసియేట్ అధికారి లక్ష్మీబాయి హాజరయ్యారు. వివిధ తరగతుల విద్యార్థులను కలిసి లీడర్లను ఎన్నుకున్నారు. అనంతరం వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా లక్ష్మీబాయి మాట్లాడుతూ.. నాయకత్వ పటిమ విద్యార్థి దశనుంచే ఆరంభం కావాలని అన్నారు. అప్పుడే క్రమశిక్షణ, ఓర్పు, నిజాయితీ, దేశభక్తి, పెద్దల పట్ల గౌరవం ఏర్పడి భవిష్యత్తులో దేశానికి ఉపయోగపడుతారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ ప్రమీల, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు ఎంతో అవసరం

ఆర్‌సీఐ పాఠశాల ఎన్‌సీసీ విభాగం అధికారి పద్మశ్రీ



ఇన్‌వెస్టిట్యూర్ సెర్మనీలో పాల్గొన్న పద్మశ్రీ తదితరులు

మీర్‌పేట: పాఠశాల దశ నుంచే విద్యార్థుల్లో నాయకత్వ బాధ్యతలను పెంపొందించడం ఎంతో అవసరమని కంచన్‌బాగ్‌లోని ఆర్‌సీఐ పాఠశాల ఎన్‌సీసీ విభాగం అధికారి ఎం. పద్మశ్రీ అన్నారు. మీర్‌పేట గాయత్రీనగర్‌లోని రవీంద్రభారతీ పాఠశాలలో మంగళవారం జరిగిన ఇన్‌వెస్టిట్యూర్ సెర్మనీకి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలలో నాయకులుగా ఎంపికైన విద్యార్థులకు పతకాలను అందజేసి ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాలలో ఇలాంటి కార్యక్రమం చేపట్టడంపై పద్మశ్రీ హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరి మాట్లాడుతూ.. నాయకులలో నిజాయితీ, ఓర్పు, క్రమశిక్షణ ఉండాలని, నాయకులుగా ఎన్నికైన విద్యార్థులు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ ఇన్‌చార్జి సీహెచ్.శాంతి, ఏడీఐ వంశీ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బురుజులు

శిథిలావస్థలో కూలేందుకు సిద్ధంగా ఉన్న కట్టడాలు

- భయాందోళనకు గురవుతున్న స్థానికులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



తిమ్మాపూర్‌లో శిథిలావస్థకు చేరిన బురుజు

కందుకూరు: పూర్వకాలంలో గ్రామాల్లో రక్షణ వ్యవస్థ కోసం గ్రామం నలువైపులా నిర్మించుకున్న బురుజులు ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. ఆనాటి రక్షణ వ్యవస్థకు ప్రతిరూపంగా నిలుస్తున్న వాటిని పరిరక్షించడంలో అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు విఫలమయ్యారు. ఇది మండల పరిధిలోని బురుజుల పరిస్థితి.

గతంలో రక్షణ కవచాలుగా..

మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆనాటి ప్రజల రక్షణ కోసం గ్రామానికి నాలుగు వైపులా ప్రత్యేకంగా బురుజులు నిర్మించుకుని వాటిపై నుంచే కాపలా కాసేవారు. గ్రామంలోకి రాత్రి వేళలో ఎవరైనా కొత్త వారు వచ్చినట్లు గుర్తిస్తే అక్కడి నుంచే హెచ్చరించేవారు. అప్పటి ప్రజలకు అవే రక్షణ కవచాలుగా ఉండేవి. కాలక్రమంలో వాటిని పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. తిమ్మాపూర్, గుమ్మడవెల్లి, మీర్‌ఖాన్‌పేట, గూడూరు తదితర గ్రామాల్లో బురుజులు శిథిలావస్థకు చేరాయి. హైదరాబాద్ పరిసరాల్లోని అప్పటి గ్రామాల్లో కొంతమంది ప్రజాప్రతినిధులు బురుజులకు మరమ్మతులు చేయించి భావితరాలకు అందిస్తున్నారు. కాని ఇక్కడ మాత్రం అదేమీ కన్పించడంలేదు. దీంతో చాలా గ్రామాల్లో ఉన్న బురుజులు కూలిపోయే ప్రమాదంలో ఉన్నాయి. వాటి పక్కనే నివసించే వారితో పాటు ఆ పక్క నుంచి వెళ్లడానికి భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామాల్లో ఉన్న బురుజులకు మరమ్మతులు చేయించి భావితరాలకు ఓ జ్ఞాపకంగా అందించాలని పలువురు కోరుతున్నారు.



గుమ్మడవెల్లిలో ప్రమాదకరంగా మారిన బురుజు

అధికారులకు నివేదిస్తాం

పూర్వకాలంలో నిర్మించిన బురుజులు ప్రస్తుతం చాలా గ్రామాల్లో శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని అభివృద్ధి చేయడానికి ఇంతవరకు ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదు. ఆ విషయమై సంబంధిత అధికారులకు నివేదిస్తాం. సమస్య పరిష్కారానికి దృష్టిసారిస్తాం.

– సరిత, ఎంపీడీఓ, కందుకూరు

అంగన్‌వాడీలతో చిన్నారులకు మేలు

బడంగ్‌పేట్ మేయర్ పారిజాత



చిన్నారులతో మేయర్, కార్పొరేటర్లు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ 9వ డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పారిజాత హాజరై మాట్లాడుతూ.. మూడేళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీ పాఠశాలకు పంపించాలని అన్నారు. చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు ఆటపాటలతో విద్యాబోధన నిర్వహిస్తున్నారని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్పులు చేస్తుండటం శుభపరిణామం అన్నారు. అనంతరం మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సునీత, శ్రీధర్‌రెడ్డి, బాబు, సుభాన్‌యాదవ్, అశోక్, మురళీ మోహన్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

కొత్త మున్సిపల్ కార్పొరేషన్ భవనం గుండా మారుతినగర్ నుంచి రాజీవ్ గృహకల్ప వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు మంగళవారం చేపట్టారు. వీటిని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత, స్థానిక కార్పొరేటర్లు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వర్షాల కారణంగా బీటీ రోడ్డు నిర్మాణంలో కొంత ఆలస్యం అయిందన్నారు. కాలనీవాసులు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకుని వెంటనే రోడ్డు పనులు మొదలు పెట్టామని తెలిపారు. అన్ని డివిజన్లో పేరుకుపోయిన పెండింగ్ పనులు వెంటనే పరిష్కరిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అర్జున్, దర్శన్‌రెడ్డి, రాంరెడ్డి, ఏఈ వినీల్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



నీటి నిల్వలను పరిశీలిస్తున్న కమిషనర్ వాణిరెడ్డి

పహాడీషరీఫ్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని విష జ్వరాల బారిన పడకుండా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ వాణిరెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని న్యూబాబానగర్‌లో ఒకరికి డెంగీ పాజిటివ్ నిర్ధారణ అయిన నేపథ్యంలో ఆ ఇంటిని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటి పరిసరాలను పరిశీలించడంతో పాటు నీటి నిల్వలను తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ వారానికి ఒకరోజు డ్రైడేను పాటించాలన్నారు.



ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఒంటి కాలిపై కార్మికుల నిరసన

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

కందుకూరు: తమ సమస్యలు పరిష్కరించాలంటూ మధ్యాహ్న భోజన కార్మికులు మండల కార్యాలయ ఆవరణలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి రెండోరోజుకు చేరాయి. దీక్షలో భాగంగా ఒంటి కాలుపై నిలబడి దండం పెడుతూ తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పట్ల మొండి వైఖరిని అవలంభిస్తోందన్నారు. 22 ఏళ్లుగా సేవలందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను మాత్రం పరిష్కరించకపోవడం దారుణమన్నారు. ఓ పక్క సకాలంలో బిల్లులు, వేతనాలు ఇవ్వకపోగా, రాజకీయ నాయకులు, హెచ్‌ఎంలు వారిని వేధిస్తున్నారని ఆరోపించారు. వారి సమస్యలను సీఎం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల అధ్యక్షుడు శ్రీను, కార్యదర్శి ప్రభావతి, కార్మికులు శంకరమ్మ, అలివేలు, భాగ్యమ్మ, మంజు, చంద్రకళ, మంగమ్మ, జంగమ్మ, అశ్విని, లలిత తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌ఆర్‌ను విమర్శిస్తే సహించేది లేదు



కందుకూరులో విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాని ప్రోటోకాల్ ఇప్పుడు ఎమ్మెల్యే సబితారెడ్డికి గుర్తుకు వచ్చిందా అని, అనవసరంగా మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్‌ను విమర్శిస్తే సహించేది లేదని కాంగ్రెస్ నాయకులు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణ నాయక్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేల కుమారులు, పార్టీ నాయకులను స్టేజీపైకి ఆహ్వానించడాన్ని ప్రస్తుతం అధికారం కోల్పోయిన తర్వాత మరిచారని ప్రశ్నించారు. కావాలనే పబ్లిసిటీ, సింపథి కోసం ఎమ్మెల్యేతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు పాట్లు పడుతున్నారని, అందులో భాగంగానే ఇదంతా చేస్తున్నారని అని ఆరోపించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ, రాణాప్రతాప్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, ఎండీ అఫ్జల్‌బేగ్, ఢిల్లీ శ్రీధర్, సరికొండ పాండు, బొక్క భూపాల్‌రెడ్డి, సయ్యద్ అజీజ్, ప్రశాంత్‌కుమార్, సత్యనారాయణరెడ్డి, ఎస్.జగన్, కుమార్, విఘ్నేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సబితమ్మది అనవసర రాద్ధాంతమే

పహాడీషరీఫ్: బోనాల పండుగ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డికి అధికారులు వేదికపై సీటు కేటాయించినా కూడా కావాలనే రాద్ధాంతం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ బడంగ్‌పేట్ కార్పొరేషన్ 11వ డివిజన్ అధ్యక్షుడు లాల్ సతీశ్‌గౌడ్, 12వ డివిజన్ అధ్యక్షుడు ఆదిల్ల జంగయ్య అన్నారు. మామిడిపల్లిలో మంగళవారం వారు మాట్లాడుతూ.. 2018లో కాంగ్రెస్ పార్టీ బీఫాంపై గెలిచి పార్టీ మారిన చరిత్ర సబితారెడ్డిదేనన్నారు. కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్‌పై విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో శేఖర్‌గౌడ్, విజయ్‌గౌడ్, శేఖర్ ముదిరాజ్, నరేందర్, భాస్కర్, నరేశ్‌గౌడ్, చెన్నయ్య, శ్రీనివాస్‌గౌడ్, రాజ్‌కుమార్‌గౌడ్, చిన్న రాజు పాల్గొన్నారు.

రాజకీయ ఉనికి లేక 'ప్రొటోకాల్'

- ఎమ్మెల్యే సబితారెడ్డి వ్యవహారంపై కాంగ్రెస్ నాయకుల విమర్శలు



సమావేశంలో మాట్లాడుతున్న రఘుమారెడ్డి, నాయకులు

మహేశ్వరం: రాజకీయంగా తన ఉనికి కోల్పోతుందనే భయంతో ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రొటోకాల్ సాకుతో బీఆర్‌ఎస్ గుండాలతో ఘర్షణ వాతావరణం సృష్టించారని కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, ఈశ్వర్‌ముదిరాజ్, యాదయ్య ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడి సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. నాటి ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నప్పుడు సబితారెడ్డి వ్యవహరించిన తీరు అందరికీ తెలుసన్నారు. అప్పట్లో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు తమ భర్తలు, మామలు, కుమారులను ప్రభుత్వ కార్యక్రమాల్లో వేదిక మీద కూర్చోబెట్టినప్పుడు ప్రొటోకాల్ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. ఆనాడు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను అడుగడుగునా అవమానపర్చి ఇప్పుడు మీ వరకు రాగానే ప్రొటోకాల్ గుర్తొచ్చిందా ఎద్దేవ చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి దేశంలో తొలి మహిళా హోంమంత్రిగా ఆమెను చేసి గౌరవించారన్నారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా అన్ని పదవులు పొంది ఇప్పుడు విమర్శలు చేయడం ఏంటని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని మోసం చేసిన వారిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, రఘుపతి, రాజునాయక్, అంధ్యానాయక్, లాజర్, కుమార్, పాండునాయక్, కృష్ణనాయక్, నర్సింహ, నర్సింహాగౌడ్, మురళీధర్‌రెడ్డి, సుభాష్, నర్సింహాయాదవ్, పాండుముదిరాజ్, నారాయణ, ప్రవీణ్, శివ, వెంకటేష్‌గౌడ్, సేవ్యానాయక్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీకి రేషన్‌కార్డు లింక్ సరికాదు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్‌రెడ్డి



మాట్లాడుతున్న కొలన్ శంకర్‌రెడ్డి

బడంగ్‌పేట్: రైతుబంధు, రూ.2లక్షల రుణమాఫీ ఇష్టంలేని కాంగ్రెస్ ప్రభుత్వానికి రేషన్‌కార్డు లింక్ చేయడం దుర్మార్గపు ఆలోచన అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బడంగ్‌పేటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పేరుతో రేషన్‌కార్డులు లింక్‌పెట్టి రైతులను నిలువునా మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఏకకాలంలో రుణమాఫీ అని చెప్పి ఏడు మాసాలుగా కథలు అల్లి చివరకు మోసపూరితమైన జీవోను విడుదల చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్‌కార్డు ఉంటేనే రుణమాఫీ తెచ్చిన జీవోతో రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఎలాంటి షరతులు విధించకుండా రైతులకు బేషరతుగా రుణమాఫీ చేయాలని లేకుంటే రైతులకు అండగా ఉండి పోరాడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను మేము చేయమని రైతులను నమ్మించి నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు నాల్కల ధోరణి అవలంబిస్తున్నదని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. రేషన్‌కార్డు కొలమానంగా సీఎం, డిప్యూటీ సీఎంలు మాట్లాడుతుంటే.. వ్యవసాయ మంత్రి రేషన్‌కార్డుతో పనిలేకుండా రుణమాఫీ చేస్తామంటున్నారు. ఏలుతున్న పాలకుల మధ్య సమన్వయం లేక రైతులు అయోమయానికి గురవుతున్నారన్నారు. కేబినేట్‌లో రెండు నాల్కల ధోరణి కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. రైతులకు అండగా బీజేపీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామిడి మహేందర్‌రెడ్డి, రవీందర్, బాల్‌రాజ్, ఇబ్రహీం, అనిల్, వాసు తదితరులు ఉన్నారు.

సన్మానం



షేక్ అఫ్జల్‌ను సన్మానిస్తున్న సయ్యద్ హుస్సేన్

పహాడీషరీఫ్: హజ్‌యాత్ర విజయవంతంగా పూర్తిచేసుకొని వచ్చిన సందర్భంగా జల్‌పల్లి మున్సిపాలిటీ మాజీ ఎంపీటీసీ షేక్ అఫ్జల్‌ను స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం సన్మానించారు. 22వ వార్డు బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, రెహమాన్, రహీం తదితరులు ఆయనకు పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. పవిత్రమైన హజ్‌ను దర్శించుకోవడం అంటే ముస్లిం ప్రజలకు జన్మధన్యం కావడమేనన్నారు.

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ



విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న డీసీపీ ప్రవీణ్‌కుమార్, సీఐ నాగరాజు

మీర్‌పేట: కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎల్‌బీనగర్ డీసీపీ సీహెచ్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధి నందనవనంలో మంగళవారం అక్షయ విద్యా ఫౌండేషన్ సహకారంతో బస్తీలోని సుమారు 40 మంది పేద విద్యార్థులకు డీసీపీ చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఎలాంటి సమస్య వచ్చినా ధైర్యంగా ఎదుర్కొని ముందుకుసాగాలని సూచించారు. అనంతరం ఆయన ఇన్‌స్పెక్టర్ నాగరాజు, మీర్‌పేట పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి నందనవనం బస్తీలో పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో సెక్టార్ ఎస్‌ఐ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు టమోటా రూ.67, వంకాయ రూ.28, బెండ రూ.28, పచ్చిమిర్చి రూ.60, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.23, క్యాలిఫ్లవర్ రూ.35, క్యాబేజీ రూ.35, క్యారెట్ రూ.35, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.38, ఉల్లిగడ్డ రూ.39, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.19, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.16, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.85, అర్వి రూ.35, మునగ రూ.80, చిలుకడ దుంప రూ.50, బీట్‌రూట్ రూ.23, కీర రూ.21, బీన్స్ రూ.55, క్యాప్సికమ్ రూ.65. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

ఔషధ మొక్కల నిలయం..

రాజీవ్‌గాంధీ ఉద్యానం



పార్కులో సేదతీరుతున్న సందర్శకులు

- వనస్థలిపురం ఆక్సిజన్ పార్కుకు సందర్శకుల తాకిడి
- 100కుపైగా ఔషధ గుణాల మొక్కల పెంపకం
- సందర్శకులతో నిత్యం కిటకిట

ఎల్‌బీనగర్: కాంక్రీట్ జంగల్‌గా మారిన నగరంలో కాస్త సేద తీరాలన్న పచ్చదనం కరువైంది. పనులు, వివిధ సమస్యలతో ఒత్తిడితో సతమతమవుతూ బిజీబిజీ జీవితం గడిపే వారు, చిన్నారులు, కిట్టిపార్టీ చేసుకునే వారికి వనస్థలిపురంలోని రాజీవ్‌గాంధీ పార్కు ఆహ్లాదం కల్పిస్తోంది. సాయంత్ర వేళలో సందర్శకులతో చిన్నారులతో, మొక్కల ప్రేమికులతో కిటకిటలాడుతోంది. రొక్క ఔషధ గుణాల మొక్కలతో ఉన్న ఈ పార్కును చూడాల్సిందే మరీ. బీఎన్‌రెడ్డినగర్ ఎన్జీవోస్‌కాలనీలోని రాజీవ్‌గాంధీ ఆక్సిజన్ పార్కు సుమారుగా నాలుగు ఎకరాల విస్తరించి ఉంది. ఉదయం వాకర్స్‌లతో సాయంత్రం సందర్శకులతో కిటకిటలాడుతోంది. దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఈ పార్కును వనస్థలిపురం వాసులకు అనుగుణంగా పచ్చదనం, తీరొక్క ఔషధగుణాలతో తీర్చిదిద్దారు. ఇక సాయంత్రం వేళలో చిన్నారులతో పాటు పార్కును సందర్శకులతో కోలాహలంగా మారుతోంది. ఈ పార్కులో సుమారుగా 100కు పైగా ఔషధగుణాల మొక్కలను పెంచుతున్నారు. దీంతో ఇక్కడి వాసులకు ఆక్సిజన్ పార్కుగా ప్రసిద్ధి గాంచింది.ఇందులో ఎర్రాస్పర్, పాండ, పైజనల్వా, పుత్రాంజ, అలుబొండ,నుల్లి, తెల్లగంజి, దేవరగన్నె, తెల్లపాలమట్ట, వెదురు,భవన, రెక్సోజన,నందివర్ధన ఇలా 100కు పైగా మొక్కలతో ఈ పార్కును ఏర్పాటు చేశారు. ఇది పూర్తిగా ఆక్సిజన్ పార్కుగా పేరు గాంచింది.

రోజు 500 మంది సందర్శన..

ఈ పార్కులో అద్భుతంగా తీర్చిదిద్దిన దోలంతకాటంగ్ డిజైన్ సందర్శకులను ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా కిట్టీ, బర్త్‌డే పార్టీలకు ఇది వేదికగా మారుతోంది. ఫొటో షూట్ ఇక్కడే తీసుకునేందుకు ఆసక్తి కనబరుస్తుంటారని సిబ్బంది పేర్కొంటున్నారు.ఈ పార్కును చూసేందుకు చాలా మంది సందర్శకులు వస్తుంటారు. ప్రతి రోజు సుమారు 500 మందికిపైగా వస్తుంటారు. ఇక సెలవు దినాల్లో వివిధ ప్రాంతాల నుంచి 1000కి పైగా సందర్శకులు వస్తుంటారన్నారు.

సందర్శన వేళలు..

ఉదయం 5 గంటల నుంచి 9 వరకు
సాయంత్రం 3 గంటల నుంచి 9 వరకు
టికెట్ ధర: పెద్దలు, చిన్నారులకు రూ.5
కెమెరాలతో రూ.300